ప్రతిజ్ఞాపాలన

ఒకరోజున శర్మ జానకితో పోట్లాడి ఆమె ముఖం చూడనని ఘోర ప్రతిజ్ఞ చేశాడు.

ఛా, ఛా, చాలా తొందరపడ్డాడు.

ఏదో స్వల్ప విషయంలో జానకితో పోట్లాడి అంత కఠోర ప్రతిజ్ఞ చేయటం మటుకు పండితుడైన శర్మ చేయవలసిన పని కాదు. చాలా శోచనీయమైన విషయము.

జానకి చేసిన పని నిజానికి అంత గొప్ప తప్పిదమూ కాదు. ఇంత అల్లరి కాకుండా క్షమిస్తే పోయేది!

జానకి సంస్కృత పండితుని భార్య అయినా ఆ సాంప్రదాయాలు రసవద్వినోద కార్యకలాపమూ ఆమెకు బొత్తిగా తెలియని కారణానే ఈ పోట్లాట వచ్చింది.

దర్శన మాత్రాన ప్రసన్నవదనంతో ప్రియవచనములతో భర్తకు స్వాగతము ఇయ్యాలని గాని, అశ్రుస్వేదాదుల అనుభవాలతో తన హృదయంలో జనించిన హర్షాన్ని ప్రకటితము చెయ్యాలని గాని, ఆ ముగ్ధబాలికకు తెలియకపోవటమే జానకీ శర్మల మధ్య జరిగిన కలహానికి కారణం.

శర్మ, 'దివసావసానకాలే, భవనద్వారి విలోచనే, దధానా అవలోక్య సమాగతం తదామా మథరామా వికసన్ముఖీ బభూవ' అనే శ్లోకాన్ని స్మరించుకొంటూ గృహోన్ముఖుడైనాడు.

అంటే, సాయంకాలమున గృహద్వారమున నేత్రములను నిలిపినదై అప్పుడు వచ్చిన నన్ను జూచి ఆ రామ వికసన్ముఖి అయినది అని శ్లోకార్థము.

జానకి కూడా ఆ విధంగానే ద్వారంలో నిలబడి తన కొరకై నిరీక్షిస్తూ విప్పారిన బొడ్డుమల్లెవంటి కనుగవతో తనను చూడలేదని శర్మకు కోపం వచ్చింది.

వచ్చిన కర్మం ఏమిటీ అంటే ఇల్లాగ చూడాలని జానకికి తెలియదు. నేను సాయంత్రం వచ్చేసరికి నీవు ఇల్లాగ నిలబడి, ఇల్లాగ చూస్తూ ఉండాలని శర్మ

ఆమెతో చెప్పి ఉన్న తరువాత ఆమె వినక ఇల్లాగ ప్రవర్తించి ఉన్నట్లయితే అతని కోపానికి తగినంత కారణము ఉందని అనవచ్చు.

శర్మ అల్లాగ ఎప్పుడూ చెప్పలేదు. ఆమె అతనను కొన్నట్లు చేయనూ లేదు. జానకి హేమభూషణాదులచే అలంకృతయై, సాయం సమయాన ఇంటికి వచ్చిన భర్తను ఎదుర్కొని మన్మథ మిత్రములైన, చిరునగవుల సరసావలోకనములలో, మంజుల రచనలుగల వచనాలతో ఆయనకు సత్కారము చేయలేదు.

జానకి ఆ సమయానికి కేశ సంస్కారం చేసుకోవటంలోనో శయ్యా రచన చేయటంలోనో, శయ్యా మందిరాన్ని అలంకరించు పనిలోనో నిమగ్నురాలై ఉన్నదేమో కాని ప్రియాగమనాన్ని ఆకాంక్షించి హర్షపులకిత గాత్రియై ద్వారంలో నిలబడి ఉండలేదన్నమాట మాత్రం నిజం.

అయితే ఇల్లాగ చేయవలయునని శర్మ జానకికి చెప్పి యుండలేదు కదా! అందుకనే జానకి ఈ లాంఛనాలన్నీ జరుపలేదు. అల్లాంటప్పుడు శర్మకు ఎందుకు కోపం రావలెనూ అని నా ప్రశ్న.

కాని ఏమిలాభం?

నేనీ ప్రశ్న వేయకముందే శర్మకు కోపం వచ్చేసింది. శర్మ కోపంతో చాలా విసురుగా ఇంట్లోకి పోయి, బట్టలు మార్చి, సాయంస్నానాది కృత్యాలు నెరవేర్చుకొని భార్యతో ఒక్కమాట అయినా మాట్లాడకుండా భోజనం చేసి, మెదలకుండా వెళ్ళి గదిలో పరుపుపైన పడుకొన్నాడు.

పోనీ పడుకొన్నవాడు, ఆ చల్లగాలిలో హాయిగా నిద్రపోయినాడా, అదీ లేదు. నిద్రపోక జానకి ప్రవర్తనను గురించి తార్కిక బుద్ధితో విమర్శనను ప్రారంభించాడు. తాను వంచింపబడినట్లూ, జానకి తనను అవహేళన చేసినట్లూ నిర్ణయించుకొన్నాడు.

శివ, శివ, జానకికి ఎంత అన్యాయం జరిగింది!

ఆ ముగ్ధ బాలికకు సంస్కృతం రాకపోవటం వలనా, సంస్కృతంలో ఉన్న శృంగార సాహిత్యంతో పరిచయములేకపోవటము వలనా ఆమెకు పరిఫుల్ల భావనా సౌభాగ్యమూ చతురతా వాల్లభ్యమూ అలవడలేదని శర్మకు తోచలేదు.

జానకి గర్వంతో ప్రవర్తించిందనీ, తనను తిరస్కరించినదనీ అనుకొన్నాడు. శృంగార కావ్యాలూ, రసగంగాధరమూ మొదలైన గ్రంథాలు చదివిన పండితులు కాబట్టి, శర్మ చాలా ప్రమాణ బుద్ధితో ఇంతగా ఆలోచించాడు కాని, ఇంకొకడు అయితే పడుకొని నిద్రపోయేవాడు.

శర్మ కోపవశుడై ఉన్న కారణాన అతని బుద్ధి వక్రమార్గాన గమించినది. జానకి విప్రలంభ శృంగార నాయికగా ప్రవర్తించకపోవటం అల్లాగుంచి ఆమెకు తనయందు అనురాగమే లేనట్లు నిశ్చయించుకొన్నాడు శర్మ.

అల్లాగ నిశ్చయించుకొని తన ప్రక్కమీదనే పడుకొని చీకటిలోకి చూస్తూ తనను ఇంతగా వంచించినట్టిన్నీ తనకు అన్యాయం చేసినట్టిన్నీ జానకి ముఖం చూడనని ఘోర ప్రతిజ్ఞ చేశాడు.

ఇల్లాంటి ప్రతిజ్ఞ ఏ గృహస్తూ చేసి ఉండలేదు. శర్మే ప్రథముడు. అందుకనే తాను ధీరోదాత్తుడు అయినాడని కూడా అతని నమ్మకం!

శర్మకు ఉచితానుచిత జ్ఞానం కూడా పోయింది. ఈ ప్రతిజ్ఞ సాధ్యమా, అసాధ్యమా అని కూడా ఆలోచించలేదు. జానకి ముఖం చూడనని నిశ్చయించుకొన్నాడు.

శర్మ చాలా పట్టుదల గల మనిషి. సంస్కృతంలో హరిశ్చంద్రోపాఖ్యానము చదివినాడు. అన్నమాట చెల్లించుకోవటంలో శర్మ సత్యహరిశ్చంద్రుడికి ఏమీ తీసిపోడు.

అయితే ఈ ప్రతిజ్ఞాపాలనలో తనకు రాగల విఘాతములను గురించి శర్మ ఊహించుకొనకపోలేదు. అబ్బే! అతను ఎన్ని శృంగార కావ్యాలు చదివినాడు. అతనికి అన్నీ తెలుసు!

జానకి వచ్చి తనపైకి వంగుతుందనీ అపుడు ఆమె కబరీచ్యుత నవపారిజాత పరిమళములు తనకు మత్తును కలుగజేయ వచ్చునని శర్మ తెలుసుకొన్నాడు.

చందనోదక సంసిక్తములైన ఆమె కుచయుగ్మ స్పర్శచే తనకు రాగల వివశత్వమును గురించి కూడా శర్మ ఊహించుకొన్నాడు.

ఇల్లాగ అన్ని విషయాలూ తెలుసుకొనే అతడు ఈ ప్రతిజ్ఞ పట్టాడు.

ఈ ప్రతిజ్ఞ వలన బాధపడేది ఆ అమాయక నవవధువు జానకి. పాపం జానకికి ఎంత అన్యాయం జరిగిందిరా ఈశ్వరా అని నేను విచార పడుతున్నాను.

శర్మ చాలా పొరపాటు చేశాడు. తొందరపాటుతో ముందు వెనుకలు ఆలోచించకుండా ఈ ఘోర ప్రతిజ్ఞ చేసినాడు?

ఎందుకు ఈ మాట అంటున్నానంటే శర్మ పడుకొన్నాడే, ఆ పరుపుపైన మల్లెపువ్వులాంటి తెల్లని దుప్పటి పరిచి ఉంచినదెవరు?

తల దిక్కున రెండు మెత్తని దిండ్లు అమర్చినదెవరు?

బల్లపైన గాజుకుప్పెలో పూలగుత్తులు విలాసంగా పెట్టి ఉంచినదెవరు?

ఆ పిల్లకు ఈ కుఱ్ఱవాడి ఎడల విముఖత్వమే ఉంటే ఈ ఏర్పాట్లు అన్నీ ఎందుకు చేస్తుంది?

ఈ విషయము అతనికి తోచకపోవటం శోచనీయము. అతని ప్రవర్తనను ఏ పండితుడూ సమర్థించలేడనే నా అభిప్రాయం.

జానకిపైన కోపం వచ్చింది! వస్తే ఏమి చేయాలిసింది. ఆమెను కోప్పడవలసింది. అయితే ఎందుకు కోప్పడలేదు. ఆసుకుమార సుశరీరను కఠినోక్తులచే బాధించటం అపండితమనీ అసంస్కృతమనీ అనుకొని ఉండవచ్చు. అందుకనే కోప్పడలేదు. అల్లా అయితే ఈ ఘోర ప్రతిజ్ఞ మటుకు బాగుందా?

సరే ప్రతిజ్ఞ చేశాడు.

చేసినవాడు ఆమె మాట తలచకుండా కళ్లు మూసుకొని నిద్రపోవాలె.

శర్మ అల్లాగ నిద్రపోలేదు. ఏవో శ్లోకాలు చదవటం మొదలుపెట్టాడు.

తన్మంజు మందహసితం శ్వసితాని తాని
సామే కలంక విధురా మధురాననశ్రీః
అద్యాపి మే హృదయ మున్మదయంతి హంత
సాయంతనాంబుజ సహోదర లోచనాయాః

అని చదివి నిట్టూర్పు విడిచాడు.

సాయం సమయ పద్మములతో సమానమైన లోచనములు కలిగిన ప్రియురాలి యొక్క ఆ మనోహర మందహసితము అశ్వసితములు. కళంక రహితమైన ఆ మధురాననము యొక్క శోభ, ఇప్పటికి నా హృదయమును ఉన్మత్తము చేస్తూ ఉన్నవి సుమా అంటాడు.

ఇదంతా జానకిని గురించే నిజం మాటకు వస్తే!

శర్మ కాదంటాడు!

ఈ శ్లోకము ఏదో పుస్తకములోనిది అంటాడు!

ఎవరో, ఎవరితోనో అన్నమాటలూ అంటాడు.

కాని ఇదంతా జానకికే అన్వయం అవుతుంతనీ, జానకిని ఉద్దేశించే తాను ఈ మాటలు మాట్లాడుతూ ఉన్నాడనీ ఎంత మందమతి అయినా ఊహించగలడు. కోపం వచ్చి ఆ పిల్ల ముఖం చూడనని ప్రతిన పట్టిన ఈ ధీరోదాత్త నాయకుడికి ఈ ఆలోచనలు ఎందుకూ అని నా ప్రశ్న?

సామాన్యుడికీ, పండితుడికీ ఇదే భేదం! సామాన్యుడికి భార్య మీద కోపం వస్తే రెండు తిట్టి ఆ పళంగా పడుకొని నిద్రపోతాడు. పండితుడైతే ఇల్లాగ సంస్కృత శ్లోకాలు చదువుకొని విచారపడతాడు.

ఎందుకయ్యా నీకు ఈ గొడవ అంతా నిద్రపోక! ఆవిడ మీద కోపం వచ్చినపుడు ఆవిడ తనూ లావణ్యాన్ని గురించీ, ఆవిడ నయనశోభను గురించీ ప్రశంస ఎందుకూ అంటే, శర్మ తాను విచారాన్ని పొందటం లేదనీ, తన అనుభూతిని స్మృతి అంటారనీ హర్షాది చతుస్త్రింశత్ భావాలలో స్మృతి కూడా ఒకటనీ చెబుతాడు.

ఏమి చెప్పినా, ఇల్లాంటి వ్యభిచారీ బావాలతో తనకేమి సంబంధం పండితుడై ఉండి కూడా! ఎబ్బే! శర్మ సంగతి ఏమీ బాగుండలేదు.

ఇల్లాగ శర్మ తన ప్రియురాలి యొక్క తనూ లావణ్యాన్ని గురించీ, స్తనభార విన్రమత్వాన్ని గురించీ, చాలాసేపు ఆలోచించి, ఆలోచించి చటుక్కున విరహవేదనలో పడిపోయినాడు.

శర్మను జూస్తే జాలివేస్తుంది!

పాపం, అతను మటుకు ఏం చేస్తాడు.

స్మృతి విరహానికి దారితీస్తుంది. అందులోకి తోస్తుంది. ఇల్లా అవుతుందని శాస్త్రంలో వ్రాసే ఉంది. శర్మ నడిచిన నడక శాస్త్రసమ్మతమే కాని తాను అల్లాంటి ప్రతిజ్ఞ చేసి ఈ విధంగా విరహంలోకి దిగటం ధీరలక్షణం మటుకు కాదు.

అప్పటికి ఇంకా రాత్రి పది కాలేదు. కాని శర్మమటుకు తీవ్రమైన విరహవేదనలో పడిపోయినాడు.

జానకి ఇంకా వంట ఇంట్లో ఇల్లు సర్దుకొంటూనే ఉంది. అప్పుడే శర్మ విరహానికి సంబంధించిన విషాదము, ఔత్సుక్యము, చింత, ఉత్కంఠ, ఆ వేగము, జడత, మోహము మొదలైన అవస్థలను పొందుతున్నాడు.

'కలిత కులిశ ఘాతాఃకేపిఖేలంతి వాతాః' అంటాడు. అంటే, వజ్రాఘాతముతో కూడుకొన్న ఏవో గాడ్పులు విసురుతున్నవట!

ఎప్పుడు!

పుష్యమాసంలో రాత్రి తొమ్మిది గంటలకు! ఇంకా అంటాడూ, రసాల శిఖరముపైన గుంజనము చేస్తూ ఉన్న తుమ్మెద కూడా తనను బాధిస్తున్నదట!

కర్మం ఏం జేస్తాము!

విరహంలో ఉన్నవాడిని ఏది బడితే అదే బాధిస్తుంది!

ఈ విధంగా శర్మ చాలాసేపు విరహాన్ని పొందాడు. విప్రలంభ శృంగారానికి విరహము ఒక ప్రధానంగము కాబట్టే ఇంత అవస్థపడి ఆ విరహాన్ని అంతా శాస్త్ర రీత్యా శర్మ అనుభవిస్తున్నాడు. ఈ విరహానుభవంలోనే అతడు ప్రమత్తుడై నిద్రాదేవీ కుచయుగ్మ ముద్రితుడైనాడు.

మరికొంచెం సేపటికి జానకి వచ్చింది.

ఆమె కనకాంబరం చీర కట్టుకొన్నది. జరీపేటగల లేత గులాబీరంగు రెవిక తొడిగినది. తన కేశబంధమును పుష్పములతో అలంకృతము చేసినది. రతీదేవిలాగ శయ్యాగృహము ప్రవేశించినది.

ప్రవేశించి కమలములవంటి తన నేత్రములతో నలుదిక్కులా కలయజూచినది. చూచి తన భర్త నిద్రపోతూన్నట్లు గ్రహించినది. గ్రహించి ఆ హరిణాక్షి వదనమును వంచి మధుర మందస్మిత అయినది.

శర్మ ఇంత పెందలకడనే నిద్రపోవడము ఆమెకు చాలా ఆశ్చర్యమును కలుగజేసినది. ఆమె అతని వంక నిశ్చలంగా చూచినది. పూర్వానుభూతులు ఏవేవో జ్ఞప్తికి వచ్చినవి.

(మే, 1955)